సాక్షి విజయనగరం

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024



సంప్రదాయ విజ్ఞానం గొప్పది
ప్రాచీన భారతీయ సంప్రదాయ విజ్ఞానం ఆధునిక విజ్ఞానం కంటే గొప్పదని ఐజీఎన్సీఏ సెక్రటరీ ప్రొఫెసర్ సచ్చిదానంద జోషి అన్నారు. - 10లో



మాడిపోయిన తెల్ల బంగారం
తెల్ల బంగారంగా పేరొందిన పత్తి పంటను తుఫాన్ కోలుకోలేని దెబ్బతీసింది. రైతుకు నష్టాన్ని మిగిల్చింది. - 10లో



స్కూల్‌కు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు... - 10లో
ఆటో నుంచి జారిపడిన ప్రమాదంలో తొమ్మిదేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు.

విద్యుత్ వినియోగదారులపై బిల్లుల మోత



- ఇంధన సర్దుబాటు పేరుతో జిల్లా వినియోగదారులపై బిల్లుల మోత
- తక్కవ విద్యుత్ వినియోగించినా అధిక మొత్తంలో బిల్లులు
- యూనిట్‌కు రూ.1.18 చొప్పన సర్దుబాటు చార్జీల వసూలు
- ప్రజావ్యతిరేక పాలనపై పోరుబాటకు పిలుపునిచ్చిన వైఎస్సార్‌సీపీ
- అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్‌శాఖ అధికారుల కార్యాలయాల వద్ద నేడు నిరసన
- బిల్లుల భారం తగ్గించాలంటూ అధికారులకు వినతులు ఇవ్వనున్న నాయకులు

- ప్రజలపక్షాన నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

సాక్షిప్రతినిధి,విజయనగరం/ విజయనగరం ఫోర్ట్:

అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ చార్జీలు పెంచబోమని.. బిల్లుల భారాన్ని తగ్గిస్తామంటూ ఎన్నికల సమయంలో హామీలిచ్చిన టీడీపీ కూటమి నేతలు... ఇప్పుడు చార్జీలు పెంచి వినియోగదారులకు షాక్ కొట్టిస్తున్నారు. తక్కువ విద్యుత్ వినియోగించినా అధిక మొత్తంలో బిల్లులు వసూలు చేస్తున్నారు. ఇంధన సర్దుబాటు పేరుతో వినియోగదారుల జేబులకు చిల్లులుపెడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు గత ప్రభుత్వం అమలుచేసిన 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ఎత్తేసి... వారికి గుండెదడ పెంచేలా రూ.వేలల్లో బిల్లుల భారం వేశారు. ఓ వైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు బిల్లుల భారంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మంచి చేస్తుందనుకున్న కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేసిందంటూ గగ్గోలుపెడుతున్నారు. చంద్రబాబు మోసపూరిత హామీలకు మరోసారి మోసపోయామని పలువురు నిట్టూర్చుతున్నారు. ప్రజల ఆవేదనను తీర్చేలా... కూటమి సర్కారు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, విద్యుత్ బిల్లుల పెంపునకు నిరసనగా వైఎస్సార్‌సీపీ శుక్రవారం పోరుబాటకు పిలుపునిచ్చింది. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోనూ ప్రజలతో కలిసి నిరసన ర్యాలీలు నిర్వహించి, బిల్లులు తగ్గించాలంటూ అధికారులకు వినతులు అందజేయనుంది.

నాడు ఉచితం.. నేడు రూ.8వేలు బిల్లు



పెంటమ్మకు వచ్చిన విద్యుత్ బిల్లు



నా పేరు కెల్ల పెంటమ్మ. మాది గుర్ల మండలంలోని కెల్ల గ్రామం. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాకు గత ప్రభుత్వంలో ఎలాంటి విద్యుత్ బిల్లు వచ్చేది కాదు. నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్‌ను సరఫరా చేసేవారు. విద్యుత్ బిల్లుల భారం ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్ బిల్లు కట్టాల్సి వస్తోంది. డిసెంబర్ నెలలో రూ .8 వేలు విద్యుత్ బిల్లు వచ్చింది. ఏం చేయాలో తోచడం లేదు. అధికారులు మాత్రం బిల్లు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు.

యూనిట్లు తగ్గినా బిల్లు రెట్టింపు



నా పేరు పేరు కొల్లి బాలకృష్ణ. మాది రామభద్రపురం మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీ. నేను మోటారు కార్మికునిగా పని చేస్తున్నాను. మా ఇంటికి గతంలో ఏడెనిమిది వందల రూపాయల లోపే కరెంట్ బిల్లు వచ్చేది. ట్రూ అప్ చార్జీల అమలు తరువాత ఒక్కసారిగా బిల్లు పెరిగిపోయింది. గత నెల 182 యూనిట్లకు రూ.938ల బిల్లు వచ్చింది. ఈ నెల 176 యూనిట్లకు రూ.1930ల బిల్లు వచ్చింది. దీంతో దిమ్మతిరిగినట్టయింది. మా ఇంట్లో పెద్దగా విద్యుత్ వినియోగం ఉండదు. కానీ ఇలా భారీగా బిల్లు పెరగడం దారుణం.



బాలకృష్ణ ఇంటి నవంబర్ విద్యుత్ బిల్లు / బాలకృష్ణ ఇంటి డిసెంబర్ విద్యుత్ బిల్లు

వాడకం తగ్గినా బిల్లు తగ్గలేదు



నా పేరు రామలక్ష్మణ. మాది రాజాం. శీతాకాలం కావడంతో విద్యుత్ వినియోగం తగ్గినా బిల్లులు మాత్రం తగ్గలేదు. గత నెల మాకు 62 యూనిట్లు వినియోగిస్తే రూ.539లు విద్యుత్ బిల్లు రాగా, ఈ నెల 52 యూనిట్లు మాత్రమే వినియోగించగా గత నెల మాదిరిగానే రూ.510లు విద్యుత్ బిల్లు వచ్చింది. విద్యుత్ యూనిట్లు సర్దుబాటు పేరుతో యూనిట్‌కు 61 పైసలు చొప్పున అదనంగా బిల్లు పడింది. మాకు వచ్చిన బిల్లులో వినియోగబిల్లు కేవలం రూ.285లు కాగా, ఫిక్స్‌డ్ చార్జీలు రూ. 52లు, కస్టమర్ చార్జీలు రూ.40లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.52లు, ఎఫ్‌పీపీసీఏ చార్జీ రూ.55లు, ఎఫ్‌పీపీసీఏ-2 చార్జీ రూ.25 చొప్పున వడ్డించారు.



విద్యుత్ వినియోగం ఇలా...

జిల్లాలో విద్యుత్ కనెక్షన్ల సంఖ్య:	6,47,922
గృహ విద్యుత్ కనెక్షన్లు:	5,72,464
వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు:	61,282
పారిశ్రామిక విద్యుత్ కనెక్షన్లు:	2,753
సంస్థలు, సాధారణ విద్యుత్ కనెక్షన్లు:	11,423
నెలకు వినియోగిస్తున్న యూనిట్లు:	268 మిలియన్లు
సర్దుబాటు చార్జీలతో వినియోగదారులపై ఏడాదికి పడే భారం:	రూ.267 కోట్లు

బిల్లుల బాదుడు ఇలా..

జిల్లాలో నెలకు 268 మిలియన్ యూనిట్లు (2.68 కోట్ల యూనిట్లు) వరకు విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఏడాదికి 3,223 మిలియన్ యూనిట్లు వరకు విద్యుత్ వినియోగం అవుతోంది. కూటమి ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరిట ఇప్పుడు యూనిట్‌కు రూ.1.18 వరకు వసూలు చేస్తోంది. దీనివల్ల విద్యుత్ వినియోగదారులపై ఏడాదికి రూ. 267 కోట్ల అదనపు భారం పడనుంది. గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.38 కోట్లు, వాణిజ్య విద్యుత్ వినియోగదారులు నుంచి రూ. 9 కోట్లు, పారిశ్రామిక విద్యుత్ వినియోగదారుల నుంచి రూ. 201 కోట్లు, సంస్థలు, సాధారణ విద్యుత్ వినియోగదారుల నుంచి రూ.19 కోట్లను ప్రభుత్వం వసూలు చేయనుంది.

పరిశ్రమలకు గడ్డుకాలం



బొబ్బిలిలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

బొబ్బిలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్తపరిశ్రమల ఏర్పాటు పక్కన పెడితే విద్యుత్ చార్జీల భారం మోయలేక ఉన్న పరిశ్రమలు మూతపడే గడ్డు పరిస్థితి దాపురించిందన్న వాదన బలంగా వినిపిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 36 ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల్లో 13 పరిశ్రమలు విజయనగరం జిల్లాలోనే ఉన్నాయి. వీటిలో 12వేల మంది కార్మికులు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ప్రస్తుత సర్దుబాటు చార్జీల లెక్కల ప్రకారం.. రోజుకు 26 టన్నులు ఉత్పత్తిచేసే పరిశ్రమలో 4వేల యూనిట్ల విద్యుత్ ఖర్చవుతుంది. దీనికి రూ.1.88లక్షల చొప్పున నెలకు రూ.56.17 లక్షల మేర విద్యుత్ బిల్లు చెల్లించాలి. అదే 10 ఫర్నేసులు వినియోగించే పెద్ద పరిశ్రమలకు నెలకు రూ.6.50 కోట్ల మేర విద్యుత్ చార్జీలు చెల్లించాలి. ఇంత భారం మోయడం సాధ్యంకాదన్నది పరిశ్రమ వర్గాల మాట. పరిశ్రమలు మూతపడితే వేలాది మందికి ఉపాధి కరువవుతుందన్న ఆందోళన నెలకొంది. గత ప్రభుత్వం విద్యుత్ రాయితీలు ఇవ్వడంతో పరిశ్రమలకు రూ.9 కోట్ల మేర భారం తగ్గేదని పరిశ్రమ వర్గాలే చెబుతున్నాయి.

బిల్లు పెరిగింది



విజయనగరం నగరం కోట పరిసరాల్లో ఎస్.బంగార్రాజు చిన్న పాటి బడ్డీ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆయనకు నవంబర్ నెలకు రూ.488 బిల్లురాగా, ఇప్పుడు రూ.527లు వచ్చింది. డిసెంబర్ నెల బిల్లులో వాడిన విద్యుత్ యూనిట్లతో పాటు ఇంధన సర్దుబాటు చార్జీల కింద అదనంగా రూ129.91 భారం వేయడంతో ఆయన లబోదిబోమంటున్నాడు.



దాసన్న విద్యుత్ సబ్ స్టేషన్

వైఎస్సార్ సీపీ పోరుబాట ఇలా...

- విద్యుత్ వినియోగదారులపై కూటమి సర్కారు చార్జీల మోతపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద శుక్రవారం పోరుబాట సాగనుంది. ప్రజల సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే పోరాటాన్ని చేపట్టింది. రైతుల సమస్యలపై ఈ నెల 17వ తేదీన కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేపట్టింది. ఈ పోరాటానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ 2025 జనవరి 3వ తేదీన ధర్నా చేపట్టనుంది. నేడు జిల్లాలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో విద్యుత్ చార్జీల బాదుడుపై నిరసన ర్యాలీలు నిర్వహించనుంది.
- చీపురుపల్లిలో జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద పోరుబాట చేపట్టనున్నారు. గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలోవిద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపట్టనున్నారు. నెల్లిమర్లలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలోను, రాజాంలో సమన్వయకర్త తలే రాజేష్ ఆధ్వర్యంలోను, ఎస్.కోటలో మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, బొబ్బిలిలో మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, విజయనగరంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయాల వద్ద పోరుబాట నిర్వహించనున్నారు.

ఉద్యమిస్తాం..



గత ప్రభుత్వ హయాంలో జార్ఖండ్, బీహార్ తదితర రాష్ట్రాల్లో పరిశ్రమలకు ఇచ్చే విద్యుత్ రాయితీ మేరకు ఏపీలో కూడా అప్పటి సీఎం యూనిట్‌కు రూ.1.60లు సబ్సిడీ ఇచ్చారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం దీనిని కొనసాగించాలే తప్ప ఇంకా ట్రూఅప్ అంటూ పెంచితే పరిశ్రమలు ఇంకేం నడుపుతారు?. బిల్లులు తగ్గించకపోతే ఉద్యమిస్తాం. – పొట్నూరు శంకరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

విద్యుత్ చార్జీలు పెంచడం తగదు



ఇప్పటికే కూరగాయలు, ఆయిల్ వంటి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. బతుకు భారంగా మారింది. సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్‌భారం వేయడం ప్రభుత్వానికి తగదు. ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి. – ఆర్.నాగేశ్వరావు, విద్యుత్ వినియోగదారుడు, పెదవేమలిగ్రామం, గంట్యాడ మండలం

అదనపు భారం



నా పేరు ఎస్.రామసూరి. మాది పూసపాటిరేగ రాజావీధి. మా ఇంటికి గత అక్టోబర్ నెల విద్యుత్ బిల్లు కంటే ప్రస్తుత నవంబర్‌లో 200 రుపాయిలు అదనంగా బిల్లువచ్చింది. వాస్తవంగా ఈ నెల విద్యుత్‌ను పెద్దగా వినియోగించలేదు. బిల్లుమాత్రం అదనంగా వచ్చింది.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



శారదాదేవి

విజయనగరం ఫోర్ట్: జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎస్.శారదాదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. డ్వామా ఉద్యోగులు ఆమెకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఆమె ఎస్.కోట అదనపు పీడీగా విధులు నిర్వహిస్తూ పీడీగా నియమితులయ్యారు. అంతకముందు కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు.

వచ్చేనెల 3న వైజ్ఞానిక ప్రదర్శన

- డీఈఓ యు.మాణిక్యంనాయుడు

విజయనగరం అర్బన్: విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజీ మ్యూజియం (వీఐటీఎం), బెంగళూరు అండ్ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ మ్యూజియం (ఎన్‌సీఎస్‌ఎం) సంయుక్తంగా దక్షిణ భారత స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించనున్నాయి. దీనిలో జిల్లా నుంచి పాల్గొనేవారి ఎంపిక కోసం వచ్చే నెల 3న స్థానిక సెయింట్ ఆన్స్ గర్ల్స్ హైస్కూల్‌లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తామని డీఈఓ యు.మాణిక్యంనాయుడు తెలిపారు. ప్రదర్శనలో భౌతికశాస్త్రం, కెమిస్ట్రీ, గణితం, ఎర్త్/స్పేస్ సైన్స్, పర్యావరణ శాస్త్రం, ఇంజినీరింగ్, బయోసైన్స్ అంశాలపై ప్రాజెక్టులు రూపొందించాలని తెలిపారు. టీచర్, విద్యార్థుల వ్యక్తిగత, గ్రూపు ప్రదర్శనలు ఇవ్వవచ్చన్నారు. తొలుత మండల స్థాయిలో ఈ నెల 30న ప్రాజెక్టుల ఎంపిక చేపడతామన్నారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

30న గురుకులంలో ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూ

విజయనగరం అర్బన్: బాడంగి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీకి ఈ నెల 30న గురుకులాల జిల్లా సమన్వయ కర్త కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని జిల్లా సమన్వయ కర్త టీఎం ఫ్లోరెన్స్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న హెల్త్ సూపర్‌వైజర్/స్టాఫ్ నర్స్ పోస్టులకు బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్‌ఎం విద్యార్హత కలిగిన పురుషులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలతో పాటు ఆ రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు.

రుణాలు మంజూరు చేయాలి


- స్త్రీనిధి ఎండీని కోరిన కలెక్టర్ అంబేడ్కర్



స్త్రీనిధి ఎండీ జీవీబీడీ హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, తదితరులు

విజయనగరం అర్బన్: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకం కింద ఎస్సీ, ఎస్టీలు సోలార్ విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు స్త్రీ నిధి రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన స్త్రీనిధి ఎండీ జీవీవీడి హరిప్రసాద్ కలెక్టర్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. రుణాల మంజూరుపై చర్చించారు. జిల్లాలోని స్వయంశక్తి సంఘాల్లో సుమారు 55 వేల మంది ఎస్సీ, ఎస్టీ మహిళలు ఉన్నారని, వీరందరికీ సూర్యఘర్ పథకం కోసం రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయనను సత్కరించారు. అనంతరం స్థానిక డీఆర్‌డీఏ సమావేశమందిరంలో స్త్రీనిధి రుణాలు, లక్ష్యాలపై సమీక్షించారు. రుణ బకాయిల వసూళ్లను 30 రోజులకు మించకుండా చేయాలని హరిప్రసాద్ డీఆర్‌డీఏ అధికారులను ఆదేశించారు. డిజిటల్ పేమెంట్ వసూళ్లకు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి, స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జమ్ములో అధికారుల పర్యటన



జమ్ములో డయేరియా కేసుల వివరాలను తెలుసుకుంటున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గుర్ల: డయేరియా ప్రబలిన జమ్ము గ్రామంలో డీఎంహెచ్‌ఓ భాస్కరరావు, డీపీఓ వెంకటేశ్వరరావు గురువారం పర్యటించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించకపోవడం వల్లే డయేరియా ప్రబలినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి డయేరియా లక్షణాలపై ఆరా తీశారు. ప్రస్తుతం డయేరియా భారిన పడివారు ఆరోగ్యంగా ఉన్నారన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులతో పాటు ప్రతీవీధిలో బ్లీచింగ్ చల్లుతున్నట్లు సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు

- బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలి
- మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాలి
- ఆధునీకరించిన రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎస్పీ వకుల్ జిందాల్



ఆధునీకరించిన రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం క్రైమ్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, బ్లాక్ స్పాట్స్ వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం విజయనగరం రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. రూరల్ సర్కిల్ పరిధిలోని గంట్యాడ, విజయనగరం రూరల్ పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల వివరాలను స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారంపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సర్కిల్ కార్యాలయంలో సర్కిల్ ఇన్‌ఫర్మేషన్ రిజిస్టర్, క్రైమ్ రిజిస్టర్, క్రైమ్‌చార్ట్, ఎస్‌బి ఫోల్డర్లు, క్రైమ్ మెమోస్, విలేజ్ రోస్టర్, జి.ఎల్.రోస్టర్, తదితర వాటిని పరిశీలించారు. అంతకుముందు ఆధునీకరించిన రూరల్ సర్కిల్ కార్యాలయాన్ని ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. వార్షిక తనిఖీల్లో విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు, రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్‌బీ సీఐ ఎ.వి.లీలారావు, రూరల్ ఎస్‌ఐ వి.అశోక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలు నిర్మాణానికి స్థల పరిశీలన

- కోస్తాంధ్ర జైళ్ల శాఖ డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్



స్థలాన్ని పరిశీలిస్తున్న జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్, తదితరులు

విజయనగరం క్రైమ్: జిల్లాలో జైలు నిర్మాణానికి స్థల పరిశీలన చేసినట్టు జైళ్ల శాఖ కోస్తాంధ్రా డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయనగరం జిల్లాలో జైలు నిర్మాణానికి చర్యల చేపట్టామన్నారు. మండల పరిధిలోని సారిక గ్రామ సమీపంలో అందుబాటులో ఉన్న ఏడు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆయన పరిశీలించారు. జైలు నిర్మాణానికి పది ఎకరాల భూమి అవసరం కాగా, సారిక గ్రామం వద్ద ఏడు ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉందన్నారు. ఆయన వెంట జిల్లా సబ్ జైళ్ల శాఖ ఇన్‌చార్జి ఎస్.శివప్రసాద్, సబ్ జైళ్ల పర్యవేక్షణాధికారి బి.సంపత్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

తీర్థయాత్ర.. విషాదయాత్ర

- పుణ్యక్షేత్రాల సందర్శనకు వచ్చి భార్యాభర్తలు మృతి
- ముందువెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టిన కారు
- అందులో ప్రయాణిస్తున్న దంపతులు అక్కడికక్కడే మృతి
- కొడుకు కోడలకు తీవ్రగాయాలు







లింగాలవలస వద్ద జరిగిన ప్రమాదంలో నుజ్జయిన కారు, (ఇన్‌సెట్లో) సంఘటనా స్థలంలో తీవ్రగాయాలపాలైన భార్య వద్ద విలపిస్తున్న అశోక్‌కుమార్

పూసపాటిరేగ: తమిళనాడు రాష్ట్రం నుంచి వందల కిలోమీటర్లు దూరం కారులో ప్రయాణించారు. శ్రీకాకుళంలోని పుణ్యక్షేత్రాలను దర్శించారు. ఆ సంతోషంతో తిరుగుప్రయాణమైన యాత్రికులను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. ఇద్దరి ప్రాణాలు తీసింది. విజయనగరం జిల్లా భోగాపురం మండలం లింగాలవలస పెట్రోల్ బంకు సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతిచెందగా, కొడుకు, కోడలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...

తమిళనాడు రాష్ట్రం చెన్నై అరుణాబకం సంజీవ నగర్‌కు చెందిన భార్యాభర్తలు యదుకుమార్ (85), శ్రీలీల (75)లు, వీరి కొడుకు అశోక్‌కుమార్, కోడలు ప్రసన్న కలిసి శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మనాథుడి దర్శనం కోసం కారులో వచ్చారు. శ్రీకూర్మనాథుడు, అరసవల్లి ఆదిత్యుని ఆలయం దర్శనం అనంతరం గురువారం తిరుగుప్రయాణమయ్యారు. అశోక్‌కుమార్ కారును నడుపుతున్నారు. విశాఖపట్నం వైపు వెళ్తుండగా విజయనగరం జిల్లా భోగాపురం మండలం లింగాలవలస పెట్రోల్ బంకు సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుకనుంచి కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న యదుకుమార్, శ్రీలీల అక్కడికక్కడే మృతి చెందారు. వారి కోడలు ప్రసన్న, డ్రైవింగ్ చేస్తున్న కుమారుడు అశోక్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే భోగాపురం సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సూర్యకుమారి ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. గాయపడిన భార్యాభర్తలను చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కె.సూర్యకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు, గ్రామస్తులు

ప్రమాదాల జోరు

భోగాపురం-లింగాలవలస మధ్యలో నెలరోజులు వ్యవధిలో జరిగిన ప్రమాదాల్లో 10 మంది వరకు మృత్యువాతపడ్డారు. ప్రమాదాలకు అతి వేగమే కారణమని తెలుస్తోంది. ఇటీవల శ్రీకాకుళం జిల్లాకు చెందిన నలుగురు అదే ప్రదేశంలో జరిగిన ప్రమాదంలో మృతిచెందారు. ఆ ప్రమాదం మరువకముందే మరో ప్రమాదం చోటుచేసుకోవడంతో స్థానికులు హడలిపోతున్నారు.

క్లుప్తంగా

మడ్డువలసలో షూటింగ్ సందడి



మడ్డువలస ప్రాజెక్టు వద్ద సినిమా షూటింగ్

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు పరిసరాల్లో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. ప్రసాద్ డైరెక్షన్‌లో శ్రీపద్మిని సినిమాస్ బ్యానర్‌పై తెలుగు, మరాఠీ భాషల్లో తెరకెక్కనున్న సినిమాకు సంబంధించి వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. శ్రీహర్ష ఆదిభట్ల మ్యూజిక్ డైరెక్షన్‌లో హీరోలు మాదవ్‌చెక్క, ప్రదిమేష్ పరబ్, హీరోయిన్స్ మోనిక, రూపాలిభీంషన్‌లు నటించనున్నారు. ముంబయి, హైదరాబాద్‌కు చెందిన చిత్ర యూనిట్ సభ్యులు ప్రాజెక్టు ప్రాంగణంలో పలు సన్నివేశాలు షూటింగ్ చేశారు. పరిసర ప్రాంతాల ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో కెమెరామెన్ ఎస్.కె.వల్లి, చిత్ర యూనిట్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల సర్వే నివేదిక సచివాలయాల్లో ప్రదర్శన

విజయనగరం అర్బన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల సర్వే నివేదికను జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ, వార్డు సచివాలయాల నోటీస్ బోర్డుల్లో గురువారం ప్రదర్శనకు ఉంచామని నివేదికపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోపు తెలిపేందుకు అవకాశం కల్పింస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. వచ్చే నెల 6వ తేదీలోగా వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. షెడ్యూల్డ్ కులాల సర్వే తుది నివేదికను ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి 10వ తేదీన ప్రచురించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించిన సర్వే నివేదికలను పరిశీలించి తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

గిరిజన ప్రాంతాల్లో బహుళ ప్రయోజనాల భవన నిర్మాణాలు

- ట్రైబుల్ వెల్ఫేర్ ఈఎన్‌సీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఈఎన్‌సీ శ్రీనివాసరావు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో బహుళ ప్రయోజనాల భవనాల నిర్మాణాలకు చర్యలు తీసుకుంటున్నట్టు ట్రైబుల్ వెల్ఫేర్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సీ) ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఫేజ్ వన్‌లో 72 భవనాలకు రూ.43 కోట్లు మంజూరు కాగా రెండు మాత్రమే పూర్తయ్యాయన్నారు. ఒక్కో భవనానికి రూ.60లక్షలు మంజూరు చేశామన్నారు. రెండో దశలో 53 భవనాల నిర్మాణాలకు రూ.31 కోట్లు మంజూరయ్యాయన్నారు. గోకులాలకు 92కుగాను రూ.20 కోట్లు మంజూరు కాగా 28 పూర్తయ్యాయన్నారు. మిగతావి వచ్చే నెలాఖరు నాటికి పూర్తి చేయనున్నామన్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు సీతంపేట ఐటీడీఏ పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్‌లో 146 పనులకు రూ.109 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఆర్టికల్ 275 పథకంలో భాగంగా 26 పనులకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. రూ.16 కోట్లతో స్కూల్స్ అదనపు భవనాలు నిర్మించనున్నామన్నారు. 14 ఏకలవ్య పాఠశాలల భవనాల నిర్మాణాలకుగాను 7 పూర్తి చేశామన్నారు. మిగతావి వచ్చే జూన్ నాటికి పూర్తి చేయనున్నామన్నారు. ఈఈ రమాదేవి, డీఈ సింహాచలం పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన మంజులవాణి

గుర్ల: కట్టుకున్న భర్తను మద్యం మానేయాలని పలుమార్లు హెచ్చరించినా తన విధానాన్ని మార్చుకోకపోవడంతో భార్య మనోవేదనకు గురై పురుగుల మందు తాగి మృతి చెందిన సంఘటన గుర్ల మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గుజ్జింగివలసకు చెందిన ఉక్కుడు శంకరరావు మద్యానికి బానిస కావడంతో భార్య ఉక్కుడు మంజులవాణి (30) మద్యం మానేయాలని పలుమార్లు సూచించింది. ఈ నెల 24న కుమార్తె పుట్టిన రోజు వేడుకలకు కూడా మద్యం సేవించి రావడంతో మంజులవాణి మనోవేదనకు గురైంది. అదే రోజు ఇంట్లో ఉన్న గడ్డి మందును సేవించింది. అపస్మారక స్థితిలో వున్న ఆమెను పక్కింటి వారు గమనించి ఆమె కుటుంబ సభ్యులకు తెలియజేసారు. వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం జిల్లాలోని క్విన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణరావు తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹220

సంప్రదాయ విజ్ఞానం గొప్పది

- ఐజీఎన్‌సీఏ కార్యదర్శి సచ్చిదానంద జోషి
- వేడుకగా గిరిజన యూనివర్సిటీ, సెంచూరియన్ యూనివర్సిటీ సంయుక్త సాంస్కృతిక సమ్మేళనం



సాంప్రదాయ గిరిజన నృత్య ప్రదర్శన



సాంస్కృతిక సమ్మేళన కార్యక్రమాలను ప్రారంభించిన ఐజీఎన్‌సీఏ మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ సచ్చిదానంద జోషి, కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి

విజయనగరం అర్బన్/నెల్లిమర్ల రూరల్: ప్రాచీన భారతీయ సంప్రదాయ విజ్ఞానం ఆధునిక విజ్ఞానం కంటే చాలా గొప్పదని అది నేటి మేధస్సుకు కూడా అంతుచిక్కడం లేదని న్యూఢిల్లీకి చెందిన ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ది ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) మెంబర్ సెక్రటరీ ప్రొఫెసర్ సచ్చిదానంద జోషి అన్నారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, సెంచూరియన్ యూనివర్సిటీ సంయుక్త నిర్వహణలో స్థానిక గిరిజన యూనివర్సిటీ ప్రాంగణంలో సాంస్కృతిక సమ్మేళనం గురువారం ప్రారంభమైంది. తొలిత నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ చికిత్సకు అందని నేటి వైద్యాన్ని వేల సంవత్సరాల క్రితమే ప్రాచీన గిరిజనులు కనుగొన్నారని వివరించారు. అది ప్రాచీన భారతీయ విజ్ఞానం యొక్క గొప్పతనమని గుర్తు చేసారు. అక్షరజ్ఞానం లేకుండానే ఎన్నో సమస్యలకు పరిష్కారాలు కనుగొన్నారని కొనియాడారు. నేడు విద్యావంతులు ప్రతి పనికి డిజిటల్ టెక్నాలజీపై ఆధారపడుతున్నారని, క్రియేటివిటీ కంప్యూటర్ మీద ఆధారపడుతున్నారని విమర్శించారు. సృజనాత్మకత పెరగాలంటే జ్ఞాపకశక్తి ఎక్కువగా ఉండాలన్నారు. కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టి.వి.కట్టిమణి మాట్లాడుతూ గిరిజనులు పండించే చిరుధాన్యాలకు మంచి గిరాకీ ఉందన్నారు. ప్రపంచంలో భారత్‌ను విశ్వ గురువుగా చూపించాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. మాలవికా జోషి మాట్లాడుతూ భారతీయులు మెరుగైన జీవనం తమ ఆశయమన్నారు. సదస్సులో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి, ప్రత్యేక అతిథి విశ్వదీప్ శుక్ల, సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, ఐకేఎస్ కన్వీనర్ డాక్టర్ దేవికారాణి, గిరిజన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసన్, సమన్వయకర్త డాక్టర్ ఎస్‌వి.సూర్యనారాయణ, డీన్ శరత్ చంద్రబాబు, డీన్ జితేంద్ర మోహన్ మిశ్రా, డాక్టర్ పి.శ్రీదేవి, డాక్టర్ కె.సురేష్ బాబు, డాక్టర్ నాగేష్, డాక్టర్ దివ్య, డాక్టర్ ప్రేమ, డాక్టర దేబాంజన్ నాగ్, సెంచూరియన్ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ శ్రావణి, డాక్టర్ జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక సెంచూరియన్ యూనివర్సిటీలో నిర్వహించిన గిరిజనుల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ నృత్యాలు, శ్రీమోదుకొండమ్మ నాటిక ఆహుతులను అలరించాయి.

మాడిపోయిన తెల్ల బంగారం



అంతకాపల్లి సమీపంలో వర్షాలకు పూత మాడిపోయిన పత్తి పంట

- తుఫాన్ వర్షాలతో పాడైన పత్తి పువ్వు, పిందె
- ఈ ఏడాది జిల్లాలో 1777 హెక్టార్లలో సాగు

రాజాం : తెల్ల బంగారంగా పేరొందిన పత్తి పంటను తుఫాన్ కోలుకోలేని దెబ్బతీసింది. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంచి పూత దశలో ఉన్న పత్తి పంట పూర్తిగా నష్టాల బారిన పడింది. నవంబర్ నెలలో పూతకు వచ్చిన పంట ఆరు దఫాలుగా పూతకు వచ్చే అవకాశం ఉంటుంది. తొలి దశ కంటే రెండు, మూడు దశల్లో వచ్చే పూత మంచి నాణ్యత ఉండడంతో పాటు మంచి దిగుబడి ఉంటుంది. ఇదే సమయంలో వరుసగా వర్షాలు కురవడంతో పిందె పూర్తిగా పాడవ్వడం, పూత దశలో ఉన్న పత్తి నల్లగా మారిపోవడం, పత్తి పువ్వు, మొక్కలు కుళ్లిపోవడంతో పంట మొత్తం నష్టాల బారిన పడింది.

డిమాండ్ ఉన్నా ఫలితం సున్నా

పత్తి పంట చేతికందినా.. స్థానికంగా విక్రయించుకోలేని పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. దీంతో తొలి పూత దశ నుంచే జిల్లాలోని పత్తి రైతుకు ఎదురీత తప్పలేదు. ఇతర జిల్లాలో పత్తి పంటకు డిమాండ్ ఉన్నప్పటికీ ఈ జిల్లాలో మాత్రం పత్తి పంటను పట్టించుకునే నాథుడు లేకపోవడంతో విక్రయాలు నెమ్మదిగా సాగాయి. ఇంతలోనే వర్షాలు పడడంతో పత్తి పంట పాడైంది. గత ఖరీఫ్‌లో జిల్లాలో 1833 హెక్టార్లలో పత్తి సాగు చేయగా ఈ ఏడాది 2683 హెక్టార్లు లక్ష్యం చేసుకోగా కేవలం 1777 హెక్టార్లలో మాత్రమే పత్తి పంట సాగైంది. 3400 మంది రైతులు ఈ పంటను ఈ ఏడాది సాగు చేసారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 20204-25 సీజన్‌కుగాను పత్తి పంట క్వింటాకు రూ.7521లు మద్దతు ధర ప్రకటించారు. ఈ మద్దతు ధర ప్రకారం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు విక్రయించాలంటే రైతులు ముందుగా ఈ క్రాప్ బుకింగ్ చేసి ఉండాలి. ఈ ప్రక్రియలో అలసత్వంతో పాటు పత్తి కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేక రైతులు తుఫాన్ వర్షాలు నుంచి పత్తి పంటను కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడింది.

జేసీబీ దొంగ అరెస్టు

- జేసీబీ దొంగ అరెస్టు



దొంగలించిన జేసీబీ వద్ద నిందితుడిని అరెస్టు చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న సీఐ కె నారాయణరావు

రామభద్రపురం: స్థానిక టీబీఆర్ థియేటర్ వద్ద పార్కు చేసిన జేసీబీ ఈ నెల 20న చోరీకి గురైంది. జేసీబీ యజమాని శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో సీఐ నారాయణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు. ఈ క్రమంలో తెర్లాం మండలం డి.గదబవలస వద్ద జేసీబీని దొంగలించిన నిందితుడు గురువారం పట్టుబడ్డాడు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీనికి సంబంధించిన వివరాలను సీఐ వెల్లడించారు. తారాపురం గ్రామానికి చెందిన శివకుమార్ తన జేసీబీని స్థానిక టీబీఆర్ ఆవరణలో పార్కు చేసాడు. అయితే ఆ జేసీబీని ఎప్పటి నుంచో పరిశీలిస్తున్న శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం శివరాంపురానికి చెందిన బద్రి హరికృష్ణ చోరీ చేసేందుకు ప్రణాళిక వేసి ఈ నెల 20న సినిమా సెకండ్ షో విడిచిపెట్టిన తరువాత జేసీబీని చోరీ చేశాడు. ఒక తాళం చెవితో జేసీబీ తాళం తీయడం విశేషం. తరువాత జేసీబీని బాడంగి మీదుగా తెర్లాం సమీపంలోని భారతి పెట్రోల్ బంకు వద్దకు తీసుకువెళ్లి రూ.1500 పెట్రోల్ వేయించి డి.గదబవలస వద్ద ఓ మామిడి తోటలో పార్కు చేసి వెళ్లిపోయాడు. పోలీసులు సీసీ కెమెరాల ద్వారా పరిశీలించి బాడంగి మీదుగా వెళ్లడాన్ని గుర్తించి జేసీబీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు హరికృష్ణ తోటలో పార్కు చేసిన జేసీబీని వెదుకుతున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి సీఐ నారాయణరావు, ఎస్ఐ వి.ప్రసాదరావు వెళ్లి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. గతంలో నిందితుడికి ఒక జేసీబీ ఉండేదని, దాని ఫైనాన్స్ చెల్లించలేక ఫైనాన్స్ కంపెనీ వారు పట్టుకెళ్లిపోయారని పోలీసులు తెలిపారు. తరువాత జేసీబీ దొంగలించి పార్టులు లెక్కన తీసేసి ఆ భాగాలను విక్రయించడం అలవాటుగా చేసుకున్నాడని తెలిపారు. నిందితుడిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు.

జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

విజయనగరం: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నగరంలోని తోటపాలెంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ నూతన అధ్యక్షురాలిగా అవనాపు భార్గవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అవనాపు విజయ్, చైర్మన్‌గా ఐవిపి.రాజు, కార్యదర్శిగా ఎం.లక్ష్మణరావు నియామకమయ్యారు. ఉపాధ్యక్షులుగా ఎం.సంతోష్, కాళ్ల మహేష్, సంయుక్త కార్యదర్శిగా లావేటి మహేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మద్దిల అప్పలనాయుడు, కోశాధికారిగా జె.హేమశంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా గౌరి, మీసాల.గీత, మద్దిల నారాయణ, బోని రమేష్‌లకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ అవనాపు విజయ్ మాట్లాడుతూ విజయనగరం జిల్లాలో ఎటువంటి గుర్తింపు లేని అసోసియేషన్ గత కొన్నేళ్లుగా నడుస్తుందని, తద్వారా క్రీడాకారులకు జాతీయ పోటీలకు వెళ్లే అవకాశం లేకుండా పోతుందన్నారు. ఈ నేపథ్యంలో నూతన అసోసియేషన్ ఏర్పాటు చేయటం ద్వారా క్రీడాకారులకు అన్ని విధాలుగా సహాయ, సహకారాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. నూతన అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించటం ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించటం జరుగుతుందన్నారు. నిరుపేద క్రీడాకారులకు అన్ని విధాలుగా ఆదుకునేలా అసోసియేషన్ తరపున చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ బాక్సర్‌లు పాల్గొన్నారు.

స్కూల్‌కు వెళ్తూ.. తిరిగిరాని లోకాలకు...

- ఆటో నుంచి జారిపడి ఐదో తరగతి విద్యార్థి దుర్మరణం
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



భార్గవసాయి(ఫైల్)



పోస్టుమార్టం గది వద్ద రోదిస్తున్న తండ్రి ఈశ్వరరావు



సీహెచ్‌సీ వద్ద ఆటోలో విలపిస్తున్న తల్లి గౌరి

చీపురుపల్లి: తొమ్మిదేళ్ల బాలుడు ఆటో ప్రమాదంలో అందనంత లోకాలకు వెళ్లిపోయాడు. పాఠశాలకని రోజూ వెళ్లే ఆటోలోనే ఎప్పటిలాగే గురువారం ఆ బాలుడు తన చెల్లితో బయలుదేరాడు. తండ్రే తమ బిడ్డలను ఆటో ఎక్కించాడు. టాటా.. బైబై.. అంటూ.. చెప్పాడు. ఇంతలోనే మగబిడ్డ ప్రమాదవశాత్తు ఆ ఆటో నుంచి జారి పడిపోయాడు. ఆటో టైరు బాలుడి మీదుగా వెళ్లిపోవడంతో మృత్యువాత పడ్డాడు. వివరాల్లోకి వెళ్తే...

మండలంలోని మెట్టపల్లి గ్రామానికి చెందిన గూనాన భార్గవసాయి(9) చీపురుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరిగానే గురువారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఆటోలో తన చెల్లి సుష్మప్రియ(4)తో కలిసి బయలుదేరాడు. వీరిని తండ్రి ఈశ్వరరావు దగ్గరుండి ఆటో ఎక్కించాడు. మెట్టపల్లి నుంచి బయలుదేరిన పదిహేను నిమిషాల్లోనే అలజంగి సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆటోలో ఉన్న భార్గవసాయి ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈ విషయం ఆటో డ్రైవర్ గమనించే లోపే భార్గవసాయి తల భాగం పైనుంచి ఆటో వెనుక చక్రం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీసుల నుంచి స్పందన కరువు

మండలంలోని అలజంగి సమీపంలో గురువారం ఉదయం 8 గంటల ప్రాంతంలో ఆటో నుంచి జారి పడిన ఘటనలో భార్గవసాయి మృతి చెందాడు. అక్కడి నుంచి స్థానికులే వేరే ఆటోలో మృతదేహాన్ని చీపురుపల్లి సీహెచ్‌సీకు తీసుకొచ్చారు. అప్పటికే భార్గవసాయి మృతి చెందాడు. ప్రమాదం జరిగి, మృతదేహం సీహెచ్‌సీకి చేరుకున్నప్పటికీ పోలీసులు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై విమర్శలొచ్చాయి. ఉదయం 9.30 గంటల వరకు పోలీసులు రాకపోవడంతో గ్రామ సర్పంచ్ శ్రీను నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సమాచారం ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

నిండు నూరేళ్ల జీవిస్తాడనుకున్న కన్న కొడుకు తొమ్మిదేళ్లకే మృత్యువాత పడడంతో తల్లిదండ్రులు ఈశ్వరరావు, గౌరీలు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కగానొక్క కొడుకు స్కూల్‌కు వెళ్తూ తిరిగి రాని లోకాలకు వెళ్లిపోవడంతో దుఃఖం దిగమింగలేకపోతున్నారు. తమ చేతులతో కొద్ది నిమిషాల ముందు ఆటో ఎక్కించిన తమ బిడ్డ అంతలోనే మృతి చెందడంతో దేవుడా... ఇంతగా శిక్షించావా? అంటూ సీహెచ్‌సీ వద్ద కన్న బిడ్డ మృతదేహాన్ని చూసి రోదించారు. మా బిడ్డను తీసుకుపోయి మాకు కడుపు కోత మిగిల్చావా..! దేవుడా.. అంటూ అరణ్య రోదనలు చేశారు. వీరి రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.

అండగా వైఎస్సార్‌సీపీ నాయకులు

ఇదిలా ఉండగా ప్రమాద విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బాలుర ఉన్నత పాఠశాల పీఎంసీ కమిటీ చైర్మన్ గవిడి సురేష్ సీహెచ్‌సీకు చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. వైద్యులతో మాట్లాడి వైద్య పరీక్షలు జరిపించారు. అప్పటికే విద్యార్థి మృతి చెందాడని వైద్యులు నిర్ధారించడంతో తక్షణమే పోస్టుమార్టం నిర్వహించాలని కోరారు. దీంతో భార్గవసాయి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

ఏటీఎం వద్ద రైతుకు టోకరా



పోలీస్‌స్టేషన్‌లో సీఐ నారాయణరావుకు ఫిర్యాదు చేస్తున్న రైతు శంకరరావు

రామభద్రపురం: ధాన్యం డబ్బులు బ్యాంకు ఖాతాలో పడిన ఆనందం ఆ రైతు కళ్లల్లో క్షణం కూడా నిలువలేదు. స్థానిక స్టేట్ బ్యాంకు ఏటీఎం వద్ద రైతును ఓ మోసగాడు తప్పుదోవ పట్టించి ఏటీఎం కార్డు మార్చేసి ఉడాయించడంతో ఆ రైతు లబోదిబోమంటూ పోలీసులు ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని దుప్పలపూడి గ్రామానికి చెందిన గొర్లి శంకరరావు ఇటీవల ధాన్యం విక్రయించగా ఆ డబ్బులు తన వ్యక్తిగత ఖాతాలో జమయ్యాయి. ఆ డబ్బులు తీసుకునేందుకు స్థానిక స్టేట్‌బ్యాంకు ఏటీఎం వద్దకు గురువారం వచ్చాడు. ఏటీఎం కార్డు మెషీన్‌లో పెట్టి డబ్బులు తీయగా డబ్బులు రాలేదు. దాంతో అక్కడ కాపుకాసి ఉన్న ఓ వ్యక్తిని మోసగాడని గుర్తించలేక అతడి చేతికి ఏటీఎం కార్డు ఇచ్చి డబ్బులు తీయాలని కోరాడు. రైతు ఏటీఎం అందుకున్న మోసగాడు ఏటీఎంలో కార్డు పెట్టి డబ్బులు తీసినట్లు కొద్దిసేపు నటించి డబ్బులు రాలేదని నమ్మబలికాడు. అనంతరం కార్డును మార్చేసి తన వద్ద ఉన్న వేరొక ఏటీఎం కార్డు రైతుకు ఇచ్చి అక్కడి నుంచి ఉడాయించాడు. కొద్దిసేపటి తర్వాత గమనించిన రైతు బ్యాంకు అధికారులను సంప్రదించగా ఆ మోసగాడు సాలూరు స్టేట్ బ్యాంకు వద్ద రూ.40 వేలు తీసినట్లు బ్యాంకు అధికారులు గుర్తించి మిగతా డబ్బులు తీయకుండా బ్యాంకు ఖాతా లాక్ చేశారు. దీంతో రైతు శంకరరావు లబోదిబోమంటూ పోలీస్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ నారాయణరావు మాట్లాడుతూ రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని, ఆ మేరకు సీసీ పుటేజ్‌లను పరిశీలించి దర్యాప్తు చేస్తామని తెలిపారు.

జనవరి 26న 50 వేల మొక్కల పంపిణీ

- కొత్తగా కాలుష్య తనిఖీ వాహనాలు, చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు
- 1 నుంచి పట్టణంలో వాకింగ్ జోన్
- వాయు కాలుష్యం మరింత తగ్గించేందుకు కలెక్టర్ అంబేడ్కర్ చర్యలు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం అర్బన్: వచ్చే నెల జనవరి 26న జిల్లా వ్యాప్తంగా 50 వేల మొక్కలు పంపిణీ చేసి నాటిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం అమలుపై ఆయన చాంబర్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు పేర్కొన్నారు. పట్టణంలో వాయు కాలుష్య తీవ్రతను తొలిత తెలుసుకున్నారు. గతంలో తీసుకున్న చర్యల ఫలితాలపై సమీక్షించారు. కాలుష్యాన్ని తగ్గించడానికి, పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించడానికి మరిన్ని చర్యలకు కలెక్టర్ ఉపక్రమించారు. దీనిలో భాగంగా విజయనగరం పట్టణంలో జనవరి 1 నుంచి వాకింగ్ జోన్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రదేశాల్లో వాహనాలను ఎట్టిపరిస్థితిలోనూ అనుమతించకూడదని, పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను కేటాయించాలని ఆదేశించారు. తొలిత స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ నుంచి గంటస్తంభం వరకు వాకింగ్ జోన్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నారు. వాహనాల కాలుష్య తనిఖీలు ముమ్మరంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. దీని కోసం పట్టణంలోని డ్వాక్రా సంఘాల ద్వారా కొత్తగా ఐదు కాలుష్య తనిఖీ వాహనాలను సమకూర్చాలని సూచించారు. అదే విధంగా విద్యుత్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పట్టణంలో రెండు సోలార్ చార్జింగ్ స్టేషన్లను మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాలని చెప్పారు. పచ్చదనాన్ని పెంచేందుకు ఒకేసారి సుమారు 50 వేల మొక్కలను పంపిణీ చేసి ప్రతి ఇంటి ఖాళీ స్థలంలో నాటేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ మూడు కార్యక్రమాలను జనవరి 26న ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పట్టణంలో దుమ్ము, ధూళి రేగకుండా ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను సైతం తారు లేదా సిమ్మెంటు రహదారులుగా మార్చడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. కల్తీ నిరోధించేందుకు ప్రత్యేక డ్రైవ్ ద్వారా అన్ని పెట్రోలు బంకులు తనిఖీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈ.ఈ సరిత, మున్సిపల్ కమిషనర్ పి.నల్లనయ్య, ప్రాంతీయ రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మణిశంకర్, ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ హరిప్రసాద్, వ్యవసాయ శాఖ జేడీ వీటీ రామారావు, ఉద్యానశాఖ డీడీ పీఎస్‌వీ లక్ష్మీనారాయణ, డీఎస్‌ఓ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర వ్యర్థ నిర్వహణ పాటించకపోతే ఆస్పత్రుల సీజ్

ఆస్పత్రుల వ్యర్థ పదార్థాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. నిబంధనలు పాటించని ఆస్పత్రులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణ అత్యంత కీలక ప్రక్రియ అని ప్రజారోగ్యానికి భంగం కలగకుండా వీటిని జాగ్రత్తగా నిర్ణీత సమయంలోగా తరలించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లా పర్యవేణ కమిటీ సమీక్షా సమావేశం గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణకు జిల్లాలో తీసుకున్న చర్యలను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇంజినీర్ బీబీ సరిత వివరించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిర్ణీత వ్యవధి 48గంటల్లోగా ఆస్పత్రిలోని చెత్తను తరలించాల్సి ఉంటుందని, అన్ని ఆస్పత్రులను జనవరి 5వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసి చెత్త తరలింపును ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్లు, వైద్య శాఖల అధికారులు, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.